సాక్షి
కామారెడ్డి
బుధవారం। 11। జనవరి। 2023



గల్ఫ్ ఏజెంట్ ఇంటి వద్ద..

సుమారు 600 మందిని మోసం చేసిన ఎమ్మెస్సీ ఫారానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ఇంటి వద్ద బాధితులు ఆందోళన చేశారు.

- 8లో ▸



క్రీడలతో మానసికోల్లాసం

జాతీయ యువజన దినోత్సవాలలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో బుధవారం క్రీడాపోటీలు నిర్వహించారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.7 /13.3

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృత మవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది.

'కౌన్సిల్' సమావేశమెప్పుడో?

- మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై వెల్లువెత్తిన నిరసన
- రద్దు చేయాలని విలీన గ్రామాల ప్రజల డిమాండ్
- తీర్మానం కోసం కౌన్సిలర్లపై పెరుగుతున్న ఒత్తిడి
- పాలక వర్గం నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

జిల్లాకేంద్రంలో మాస్టర్ ప్లాన్ ముసాయిదా మంటలు చల్లారడం లేదు. ముసాయిదాను రద్దు చేయాల్సిందేనని విలీన గ్రామాల రైతులతో పాటు పట్టణంలోని పలు కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించి తీర్మానం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై బల్దియా పాలకవర్గంపై ఒత్తిడి పెంచేందుకు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేయడానికి సిద్ధమయ్యారు.



మాస్టర్ ప్లాన్ రద్దు కోసం బల్దియాలో తీర్మానం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, చైర్‌పర్సన్ తండ్రి వేణుగోపాల్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు(ఫైల్)

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి బల్దియా పరిధిలో మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనతో రైతులు, ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్ల మూలంగా తమ భూముల విలువ పడిపోతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తుండగా.. రోడ్ల విస్తరణ పేరుతో తమ భూములను లాక్కునే కుట్ర జరుగుతోందని మరికొందరు ఆరోపిస్తున్నారు. దీంతో మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నెల క్రితం రైతులు ఆందోళన బాట పట్టారు. అప్పటినుంచి రోజూ వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూ వస్తున్నారు. వారం క్రితం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన రాములు అనే రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనతో రైతుల్లో ఆవేదన మరింత పెరిగింది. ముసాయిదాను రద్దు చేయాల్సిందేనని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కుటుంబ సభ్యులతో కలిసి రైతులు నిర్వహించిన భారీ ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు ఉద్రిక్తతకు దారి తీశాయి. మరుసటి రోజు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ కామారెడ్డి బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్ రోజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆత్మహత్య చేసుకున్న రాములు కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం కలెక్టరేట్ ముట్టడికి తరలారు. ఈ సందర్భంగా పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. సంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంతో బీజేపీ కార్యకర్తలు పోలీసు వాహనంపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆదివారం రైతులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అభ్యంతరాల స్వీకరణకు చివరి రోజైన బుధవారం బల్దియా వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారు.

ఏ నిర్ణయం తీసుకుంటారో..

మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనతో నష్టపోతున్న రైతులు దాన్ని రద్దు చేయాలని పట్టుబడుతున్నారు. ముసాయిదాను రద్దుచేయాలంటే మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం అవసరం. సోమవారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి ముసాయిదా రద్దు కోసం తీర్మానం చేయాలని వినతిపత్రాలు ఇచ్చారు. మంగళవారం బీజేపీకి చెందిన కౌన్సిలర్లు కమిషనర్‌ను కలిసి 12 న మున్సిపల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం రైతులు బుధవారం బల్దియా వద్ద ధర్నా చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

ముసాయిదాను రద్దు చేయకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇలా బాధిత రైతులు వరుసగా ఆందోళనలు చేస్తుండడంతో మున్సిపల్ పాలకవర్గంతోపాటు అధికార యంత్రాంగంపైనా ఒత్తిడి పెరుగుతోంది. అయితే రైతులు, ప్రజలు ఆందోళనలను తీవ్రతరం చేయడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పందించి రైతుల అభ్యంతరాలను పరిశీలిస్తామని, ఎవరి భూములు ఎటూ పోవని పేర్కొన్నారు. డీటీసీపీ అధికారులు, కన్సల్టెన్సీల నిర్లక్ష్యం వల్లే ముసాయిదాలో కొన్ని తప్పిదాలు జరిగాయన్న ప్రభుత్వ విప్ గంప గోవర్దన్.. వాటిని సరి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందొద్దని, తాను మంత్రి కేటీఆర్‌తో మాట్లాడానని, సమస్య పరిష్కారమవుతుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సైతం భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే మాటలు చెబితే సరిపోదని, మున్సిపల్ కౌన్సిల్‌లో ముసాయిదా రద్దు తీర్మానం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కౌన్సిల్ పాలకవర్గం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న విషయమై ఉత్కంఠ నెలకొంది. కౌన్సిల్‌కు మాస్టర్ ప్లాన్ సవాల్‌గా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు రైతు జేఏసీ ధర్నా

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా ఉంటుందని పేర్కొన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని బాధిత రైతులను కోరారు.

నేడు హైకోర్టులో వాదనలు

కామారెడ్డి టౌన్: తమను సంప్రదించకుండానే తమ భూములను రిక్రియేషన్ జోన్‌లోకి చేర్చారని, దీంతో తాము నష్టపోతున్నామంటూ రామేశ్వరపల్లికి చెందిన 40 మంది రైతులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 9వ తేదీన వాదనలు విన్న తర్వాత కేసును బుధవారానికి వాయిదా వేసింది. అడ్వొకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు విచారణ వాయిదా పడింది. బుధవారం మరోసారి వాదనలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు ఎలా స్పందిస్తుందన్న విషయమై ఆసక్తి నెలకొంది.

రేపు కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్ రద్దు చేయడానికి గురువారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ ఫ్లోర్‌లీడర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై మున్సిపల్ తీర్మానం చేసినట్లుగా కలెక్టర్, ఎమ్మెల్యేలు చెప్పారని, అది అబద్ధమని పేర్కొన్నారు. కొందరి స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేసుకున్నట్లు ఉందన్నారు. రైతులకు నష్టం కలిగేలా ఉన్న కామారెడ్డి పట్టణ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని, అందరితో చర్చించి నూతన ముసాయిదా రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నరేందర్, శ్రీనివాస్, రవి, పండ్ల ప్రవీణ్, అన్మండ్ల మానస, నాయకులు అన్మండ్ల సురేష్, ఆకుల భరత్ తదితరులు పాల్గొన్నారు.

2,100లకుపైగా దరఖాస్తులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై భారీగా అభ్యంతరాలు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 2,100 లకుపైగా దరఖాస్తులు వచ్చాయని మున్సిపల్ టీపీవో గిరిధర్ తెలిపారు. నేరుగా మున్సిపల్ కార్యాలయానికి 1,500లకుపైగా అభ్యంతరాలు రాగా.. నోటీసుల రూపంలో మరో 600 వచ్చాయన్నారు. అభ్యంతరాల స్వీకరణ గడువు బుధవారంతో ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం కార్యాలయ పనివేళలలో అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

కామారెడ్డి అర్బన్: మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు తెలుపుతూ కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. కళాశాల భూముల నుంచి రోడ్లు ప్రతిపాదించడంపై అభ్యంతరం తెలిపామన్నారు. దీనిపై పురపాలక శాఖ డైరెక్టర్, టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్లకు సైతం లేఖలు రాశామన్నారు.

'వెన్నెల'కు ప్రోత్సాహం

- కిలిమంజారో పర్వతారోహణకు ఎంపీ సంతోష్ సాయం
- రూ.3 లక్షలు అందజేత
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన బానోత్ వెన్నెల



రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్‌తో మాట్లాడుతున్న వెన్నెల

సాక్షి, కామారెడ్డి: కిలిమంజారో పర్వతారోహణకు ఎంపికైనా.. చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్న గిరిజన విద్యార్థిని బానోత్ వెన్నెలకు రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ అండగా నిలిచారు. ఆయన రూ. 3 లక్షల సాయం అందించారు.

మాచారెడ్డి మండలం సోమారంపేట రోడ్డు బండ తండాకు చెందిన వెన్నెల కామారెడ్డి పట్టణంలోని సాందీపని కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గతంలో మట్టిని రక్షించుకుందాం అంటూ తెలుగు రాష్ట్రాల్లో 5 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేసింది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్న ఆమె కిలిమంజారో పర్వతారోహణకు ఎంపికైంది. ఈనెల 19 నుంచి 28 వరకు పర్వతారోహణ చేయాల్సి ఉంది. అయితే పర్వతారోహణకు రూ. 3 లక్షల వరకు ఖర్చవుతాయి. నిరుపేద అయిన ఆమె నిరుత్సాహానికి గురైంది. ఆమె ఆర్థిక పరిస్థితిపై ఈనెల 3న 'వెన్నెల.. శిఖరం చేరేదెలా?' శీర్షికన 'సాక్షి' కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. తనకు సాయం అందించాలని కోరుతూ ఆమె ఈ కథనం క్లిప్పింగ్‌ను ఎంపీ సంతోష్‌కుమార్ పీఏకు పంపించింది. దీంతో స్పందించిన ఎంపీ.. ఆమెకు మంగళవారం అపాయింట్‌మెంట్ ఇచ్చి మాట్లాడారు. పర్వతారోహణకు అవసరమైన రూ.3 లక్షల నగదును అందించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వెన్నెల 'సాక్షి'తో మాట్లాడుతూ కృతజ్ఞతలు తెలిపింది. 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని ఎంపీకి చూపించానని, ఆయన సాయం చేశారని పేర్కొంది.

రికార్డు స్థాయిలో ఆయిల్‌పాం సాగు

- ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంత్‌రావు



వివరాలు తెలుసుకుంటున్న ఉద్యాన శాఖ డైరెక్టర్ హన్మంత్‌రావు

నాగిరెడ్డిపేట: రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఆయిల్ పాం సాగు చేస్తున్నారని రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంత్‌రావు పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయిల్ పాం సాగులో రాష్ట్రం దేశంలోనే ద్వితీయస్థానంలో ఉందన్నారు. మాల్తుమ్మెద విత్తనక్షేత్ర భూములను మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేతో కలిసి పరిశీలించారు. ఆయిల్ పాం సాగు సాధ్యాసాధ్యాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 52వేల ఎకరాలలో ఆయిల్ పాం సాగవుతోందన్నారు. మార్చి నెలాఖరు వరకు మరో 70 వేల ఎకరాలలో సాగు చేయాలన్నది లక్ష్యమన్నారు. ఆయన అంతకుముందు మాల్తుమ్మెద శివారులో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాన్ని పరిశీలించారు. క్రీడాప్రాంగణంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులతో మాట్లాడారు. అధికారులతో కలిసి మొక్కను నాటారు. ఆయనవెంట సైంటిస్ట్ రామారావు, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, జిల్లా ఉద్యాన అధికారి విజయభాస్కర్‌రెడ్డి, డీఏవో భాగ్యలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, డీఆర్‌డీవో సాయన్న, ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీను నాయక్, ఎంపీపీ రాజ్‌దాస్, మాల్తుమ్మెద సర్పంచ్ ప్రతిభ, తహసీల్దార్ సయాద్ అహ్మద్ మస్రూర్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, హెచ్‌వో రామకృష్ణ, ఏవో విజయశేఖర్ తదితరులున్నారు.

కలెక్టరేట్‌లో ఘన స్వాగతం

కామారెడ్డి క్రైం: పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఉద్యానవన డైరెక్టర్ హనుమంతరావు మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చారు. ఆయనకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఉద్యానవన శాఖ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన బొప్పాస్‌పల్లి విత్తన క్షేత్రాన్ని, పోచారంలో ఆయిల్‌పామ్ సాగును పరిశీలించేందుకు వెళ్లారు.

'ఆయిల్‌పాంపై దృష్టి సారించాలి'

బాన్సువాడ రూరల్: భవిష్యత్తులో మంచి లాభాలు గడించేందుకు రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టిసారించి హార్టికల్చర్ డైరెక్టర్ హన్మంత్‌రావు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి పోచారం గ్రామంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అల్లుడు వెంకట్ రాంరెడ్డికి సంబంధించిన ఆయిల్‌పాం క్షేత్రాన్ని సందర్శించారు. ఆయిల్‌పాం పంట సాగు వల్ల లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, నీరజ వెంకట్రాంరెడ్డి, భగవాన్‌రెడ్డి, బలరాం నాయక్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి'



కాంగ్రెస్ పార్టీలో చేరినవారితో మాజీ మంత్రి షబ్బీర్ అలీ

రాజంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే రాజంపేట ప్రాంతం అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మంగళవారం మండలానికి చెందిన పలు కుల సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డి నుంచి గుండారం వరకు బీటీ రోడ్డు, సబ్ స్టేషన్లు కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, టౌన్ అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, నాయకులు కృష్ణారావ్, వీరన్న పటేల్, బాలకిషన్, సిద్ధరాములు, వజాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- రూ. 5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు తెలిపిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



వివరాలు తెలుపుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: దొంగతనాలు చేయడంలో కరుడుగట్టిన ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నవంబర్ 2న కామారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీలో నివసించే శశికళ ఇంట్లో చోరీ జరిగింది. దొంగలు రూ. 90 వేలు ఎత్తుకెళ్లారు. దీనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి పోలీసులు గాలిస్తున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రామారెడ్డి చౌరస్తాలో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది.

28 దొంగతనాలు, ఓ రేప్ కేసు..

పోలీసులకు చిక్కిన దండుగుల ఎల్లప్ప కరుడగట్టిన నేరస్తుడు. అతడిపై పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 28 దొంగతనాల కేసులున్నాయి. బాన్సువాడ ప్రాంతానికి చెందిన ఎల్లప్ప ప్రస్తుతం కామారెడ్డిలోని బతుకమ్మ కుంటలో నివాసం ఉంటూ చోరీలకు పాల్పడుతున్నాడు. అతడు బాన్సువాడలో ఓ రేప్ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. అప్పటినుంచి కోర్టుకు హాజరు కావడం లేదు. అతడు తప్పుడు పత్రాలతో పాస్‌పోర్టు పొంది సింగపూర్, మలేషియా దేశాలకు వెళ్లి వచ్చాడు. ఎల్లప్ప ఇటీవల కామారెడ్డిలో 8 దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఏడాది క్రితం భారీ చోరీ..

జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివసించే ఓ వ్యాపారి ఇంట్లో ఏడాది క్రితం చోరీ జరిగింది. ఎల్లప్ప ఆ వ్యాపారి ఇంట్లోనుంచి రూ. 20 లక్షల నగదు, 4 తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. సంపద దొంగలపాలైందన్న బెంగతో సదరు వ్యాపారి గుండెపోటుకు గురై కొద్దిరోజులకే చనిపోయాడు. వ్యాపారి మరణానికి పరోక్షంగా ఎల్లప్పనే కారణమని కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. ఎల్లప్ప అనుచరుడైన ఉప్పు రాములు సైతం రెండు చోరీల్లో నిందితుడన్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 2.20 లక్షల నగదు, 4 తులాల బంగారం, 2 ఎల్ఈడీ టీవీలు, ఒక హోం థియేటర్‌తో సహా మొత్తం రూ. 5 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశామన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్, సీసీఎస్ సీఐ మల్లేష్‌గౌడ్, కామారెడ్డి ఎస్సైలు రాములు, రాజు, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, సిబ్బంది గణపతి, ముఖేష్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, రవిలను ఎస్పీ అభినందించారు.

న్యూస్‌రీల్

నేటినుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా బుధవారం నుంచి ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. జనవరి నెలకు సంబంధించి ఆహార భద్రత కార్డుదారులకు ఒక్కొక్కరికి 5 కిలోలు ఇవ్వనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందించనున్నారు.

కరోనా వ్యాప్తి ప్రారంభమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద ఒక్కో లబ్దిదారుకు ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్య సరఫరా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐదు కిలోల బియ్యం అందించింది. ఈ పథకం గడువు డిసెంబర్‌తో ముగియగా.. కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్ర ప్రభుత్వ వాటాకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో కేంద్రం ఇచ్చే ఐదు కిలోలే అందించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఐదు కిలోల చొప్పున ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం చేరాయి. బుధవారం నుంచి బియ్యం పంపిణీ ప్రారంభం కానుంది.

'సౌత్‌క్యాంపస్ అభివృద్ధికి కృషి'



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ రవీందర్‌గుప్తా పేర్కొన్నారు. మంగళవారం సౌత్‌క్యాంపస్‌లో భౌతికశాస్త్రానికి సంబంధించిన ఆరు ప్రయోగశాలలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రయోగశాలల్లో 23 కంప్యూటర్లు, మైక్రో కంట్రోలరు కిట్లు, మైక్రో ప్రాసెస్ కిట్లు, ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డుతోపాటు ప్రయోగాలకు సంబంధించిన అన్ని పరికరాలను సమకూర్చామన్నారు. ఈ సందర్భంగా వీసీకి సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ లావణ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెయూ రిజిస్ట్రార్ విద్యావర్ధిని, భౌతికశాస్త్రం హెచ్‌వోడీ లలిత, సైన్స్‌డీన్ అరుణ, ఆచార్యులు మోహన్ బాబు, హరిత, దిలీప్, శ్రీమాత, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పోర్టుపోలియో జడ్జిగా శ్రీసుధ

సాక్షి,కామారెడ్డి: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పోర్టుపోలియో జడ్జిగా హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీసుధ నియమితులయ్యారు. కామారెడ్డి, నిజామాబాద్‌లోని కోర్టులలో అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన విషయాలపై ఆమెసలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

జహీరాబాద్ లోక్‌సభ ప్రభారీగా మహీపాల్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: భారతీయ జనతా పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ప్రభారీతోపాటు కన్వీనర్, జాయింట్ కన్వీనర్‌లను ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభారీగా బద్దం మహీపాల్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. కన్వీనర్‌గా రవికుమార్ గౌడ్, జాయింట్ కన్వీనర్‌గా కాసర్ల శ్రీనివాస్‌లను నియమించామని ప్రకటనలో పేర్కొన్నారు.

నిజామాబాద్ లోక్‌సభ

సుభాష్‌నగర్: నిజామాబాద్ బీజేపీ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రభారీగా వెంకట రమణి మంగళవారం నియమితులయ్యారు. ఆయన గతంలో నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా కొనసాగారు. అదేవిధంగా లోక్‌సభ కన్వీనర్, జాయింట్ కన్వీనర్లను బీజేపీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. లోక్‌సభ కన్వీనర్‌గా డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, జాయింట్ కన్వీనర్‌గా గుంటుక సదాశివను నియమించారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ఉస్మానియా విశ్వ విద్యాలయంలో దూరవిద్య విధానంలో పీజీ, పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకోసం మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ, ఎమ్మెస్సీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు కామారెడ్డి కళాశాల ఆంగ్ల విభాగంలోగాని 94403 56276, 91823 04067 నంబర్లలోగాని సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

పోచారం జీపీ కార్యదర్శికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని పోచారం జీపీ ట్రాక్టర్‌ను ప్రైవేట్ పనులకు వినియోగిస్తున్నారని ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీవో సూర్యకాంత్ ఈ విషయంపై విచారణ జరిపి పోచారం జీపీ కార్యదర్శికి మెమో జారీ చేశారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల్ సొంత పనులకు ఎవరైనా వినియోగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎంపీవో సూర్యకాంత్ హెచ్చరించారు.

ప్రశాంతంగా పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం యూజీ, పీజీ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన యూజీ 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 1031 మంది విద్యార్థులకు గానూ 970 మంది హాజరు కాగా 61మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 3వ సెమిస్టరు రెగ్యులర్ పరీక్షల్లో 10,831 మంది విద్యార్థులకు గానూ 10,058 మంది హాజరయ్యారన్నారు. తెయూ మెయిన్ క్యాంపస్‌లో ఉదయం జరిగిన పీజీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 32మంది విద్యార్థులకు గానూ 24 మంది హాజరయ్యారని కంట్రోలర్ అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పీజీ 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 12 మంది విద్యార్థులకు గానూ 11 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

వార్డెన్, హెడ్‌కుక్ సస్పెన్షన్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల డిప్యూటీ వార్డెన్ హైమద్ పాషా, హెడ్ కుక్ సామెల్‌ను సస్పెండ్ చేస్తూ మైనార్టీ గురుకుల పాఠశాలల సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేసినట్లు మైనార్టీ పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 23న పాఠశాలలో ఉదయం అల్పాహారం చేస్తున్న విద్యార్థులకు ఉప్మాలో పురుగులు రావడంతో 15 మంది విద్యార్థులు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. దీనికి బాధ్యులైన డిప్యూటీ వార్డెన్, హెడ్ కుక్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

కొక్కాలేసి.. విద్యుత్ కాజేసి..

- యథేచ్ఛగా విద్యుత్ చోరీ
- పోల్ టు పోల్ సర్వే చేస్తున్న విద్యుత్ అధికారులు
- పౌల్ట్రీ ఫారాల్లో అధికంగా చోరీ జరుగుతోందని గుర్తింపు
- తనిఖీలు చేపట్టినా ఆగని వాడకం

బీబీపేట : విద్యుత్ వాడకంలో ఎంతో ఆధునాతన పరిజ్ఞానం వచ్చినప్పటికీ విద్యుత్ చోరీలు ఆగడం లేదు. అధికంగా విద్యుత్ చోరీ కావడంతో ట్రాన్స్‌కోకు భారంగా మారింది. విజిలెన్స్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టినా చోరీలు మాత్రం ఏ మాత్రం ఆగడం లేదు. గృహావసరాలే కాకుండా పౌల్ట్రీ ఫారాల్లో కూడా విద్యుత్ చోరీలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించి దాడులు చేస్తున్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు జరిమానాలు విధిస్తున్నారు.

ఇలా జరుగుతోంది..

విద్యుత్ చోరీ ముఖ్యంగా డిజిటల్ మీటర్లకు ఉన్న సీల్ తొలగించి ఇన్‌పుట్, ఔట్‌పుట్‌లను కలిపేస్తున్నారు. దీంతో ఎవరికి అనుమానం రాకుండా ఎప్పటిలాగే సీల్ అమర్చుతున్నారు. అంతే కాకుండా పౌల్ట్రీ రంగాల్లో అధికంగా విద్యుత్ చోరీ జరుగుతోంది. కోడిపిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వాటికి కావాల్సిన వేడి కోసం ఎక్కువ వాట్స్ కలిగిన విద్యుత్ బల్బులను ఉపయోగించడానికి నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ నుండి విద్యుత్‌ను చోరీ చేస్తున్నారు. అంతే కాకుండా గృహావసరాలకు సంబంధించిన విద్యుత్‌ను నేరుగా కొక్కాలేసి కాజేస్తున్నారు. విద్యుత్ చోరీని అరికట్టడానికి గానూ విద్యుత్ అధికారులు దాడులు చేస్తున్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా జరిమానాలు విధిస్తున్నారు. విద్యుత్ తీగలకు నేరుగా కొక్కాలు వేయడం, సర్వీస్ మీటర్లకు బైపాస్ కనెక్షన్లు ఇవ్వడం, సర్వీసు వైరును ట్యాంపరింగ్ చేస్తూ అక్రమంగా వాడుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ నుండి విద్యుత్ చోరీని పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

కేసులు పెట్టినా..!

విద్యుత్ చోరీ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నప్పటికీ విద్యుత్ చోరీ ఆగడం లేదు. విద్యుత్ అధికారులు గడిచిన మూడు నెలల వ్యవధిలోనే దోమకొండ పరిధిలో ఉన్నటువంటి భిక్కనూర్, బీబీపేట, రాజంపేట, దోమకొండ మండలాల్లో దాడులు చేసి అక్రమంగా చోరీ చేసిన వారిని పట్టుకొని 242 కేసులు నమోదు చేశారు. కోళ్ల ఫారాల్లో విద్యుత్ చోరీ చేస్తున్న వారు నవంబర్‌లో 3, డిసెంబర్‌లో 3 కేసులు నమోదు, నేరుగా కొక్కాలేసి విద్యుత్ చోరీ చేస్తున్న వారు అక్టోబర్ 64, నవంబర్ 121, డిసెంబర్ 26, మీటర్లతో చోరీ చేసిన వారు అక్టోబర్‌లో 6, నవంబర్‌లో 15, డిసెంబర్‌లో 4 కేసులు నమోదు చేశారు. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీలకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తుంది. ఉచిత విద్యుత్ కోసం వారు చేయాల్సింది కేవలం మీటర్లను పెట్టుకోవడం మాత్రమే. కాని వారు అలా చేయట్లేదు.

విద్యుత్ చౌర్యం నేరం



ప్రభుత్వం ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడికి సబ్సిడీ సదుపాయం అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు నెలకు 100 యూనిట్లు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుంది. అంతే కాకుండా పౌల్ట్రీ ఫారాల రైతులకు కూడా ఎక్కడ ఫారాలు నిర్మించినప్పటికీ అక్కడి వరకు లక్షల్లో ఖర్చు చేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నాం. అయినప్పటికీ విద్యుత్‌ను చోరీ చేస్తున్నారు. విద్యుత్ చౌర్యం నేరం.

– కిరణ్ చైతన్య, ఏడీఈ, దోమకొండ

ఏఈ అక్రమాలు వాస్తవమే..

- ట్రాన్స్‌కోలో కొనసాగుతున్న విచారణ
- సమగ్రంగా విచారిస్తే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం

నిజామాబాద్ నాగారం : విద్యుత్‌శాఖలోని మోపాల్ మండల పరిధిలో అవినీతి అక్రమాలు జరిగింది వాస్తవామేనని అధికారుల ప్రాథమిక విచారణలో తెలింది. మోపాల్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఏఈ ఇష్టారాజ్యాంగా విధులు నిర్వహించి అక్రమాలకు పాల్పడ్డట్లు తెలిసింది. విద్యుత్‌శాఖ స్టోర్ నుంచి 200 స్తంభాలతో పాటు అవసరమై కండక్టర్ డ్రా చేసినప్పటికీ ఎక్కడెక్కడ వాటిని వేశారో లెక్కల్లో లేకుండా పోయింది. సుమారు రూ. 10 లక్షల పైనే అక్రమాలు జరిగాయని ప్రాథమిక విచారణలో తేలడంతో ఎల్లారెడ్డిపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఏఈని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

లోతుగా విచారిస్తే..

క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించి వరంగల్ నుంచి ఎస్ఈ మాధవరావు ఆధ్వర్యంలో జిల్లాలో ప్రాథమికంగా విచారణ చేసిన విషయం తెలిసిందే. ఏఈ బాధ్యతారాహిత్యం, ఇష్టారాజ్యాంగా విధులు నిర్వహించడంతో పాటు అక్రమాలకు పాల్పడడం వల్లే సీఎండీ గోపాల్‌రావు సదరు ఏఈని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ వేశారు. పూర్తిస్థాయిలో సమగ్రంగా విచారణ చేస్తే మరిన్ని అక్రమాలకు బయటకు వచ్చే అవకాశం లేకపోలేదు. ఏఈ అక్రమంగా కాంట్రాక్టర్‌లతో కుమ్మక్కై వర్క్‌లు చేసి అందినకాడికి దండుకుంటుకున్నారు. అక్రమాలకు పాల్పడిన ఏఈ బిల్లును పైకి పంపిస్తే విచారించాల్సిన ఏడీఈ ఆపై స్థాయి అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో అక్రమాలకు అడ్డూ లేకుండా పోయింది. సమగ్రంగా విచారణ చేస్తే మరిన్ని అక్రమాలతో పా టు అవినీతికి పాల్పడిన అధికారుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని శాఖలో చర్చించుకుంటున్నారు.

విచారణ జరుగుతుంది..

మోపాల్ మండల పరిధిలో అక్రమాలు జరగడంతో ప్రాథమికంగా ఎల్లారెడ్డి పల్లి నుంచి ఏఈ సంతోష్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. సీఎండీ ఆదేశాలతోనే శాఖాపరమైన విచారణ పూర్తిస్థాయిలో జరుగుతుంది.

– రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

ప్రవేశ పరీక్ష వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకుల కళాశాలలు ఉమ్మడిగా నిర్వహించే ప్రవేశ పరీక్ష టీజీయూజీ సెట్ – 2023 పురస్కరించుకుని రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీజీయూజీ సెట్ – 2023 ప్రవేశ పరీక్షకు హాజరు కావాలనుకునే ఆసక్తి, అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. https://tswreis.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్ పూర్తి చేసుకున్న వారితోపాటు సెకండియర్ చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. నిజామాబాద్ సోషల్ వెల్ఫేర్ 79950-10688, ఆర్మూర్ సోషల్ వెల్ఫేర్ 91825-84753, తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల నిజామాబాద్ 90307-29706 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్, ఆర్మూర్ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు కే లావణ్య, కే గాయత్రి, నిజామాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైనథ్, వైస్ ప్రిన్సిపాల్ వాసవీలత, తెలుగు విభాగాధిపతి కే రజిత పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

మహిళలకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ

డిచ్‌పల్లి(నిజామాబాద్) : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో మహిళలకు ఈ నెల 17 నుంచి ఉచిత స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరక్టర్ జి.కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మగ్గం వర్క్, టైలరింగ్ (కుట్టుమిషన్), బ్యూటీపార్లర్ కోర్సుల్లో 30 రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఉచిత శిక్షణ, భోజనం, హాస్టల్ వసతి, మెటీరియల్, బుక్స్, యూనిఫామ్ అందిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన 19 నుంచి 35 ఏళ్ల వయస్సున్న గ్రామీణ యువతులు ఉచిత శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ, డిచ్‌పల్లిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 08461 222428, 08461 295428లో సంప్రదించాలన్నారు.

ఆలయాల్లో చోరీ



హుండీని బయట పడేసిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో శుక్రవారం దేవి ఆలయంలో, చేపూర్ గ్రామ శివారులోని సాయిబాబా ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం గుర్తు తెలియని ఇద్దరు ఆలయ గేటు తాళాలను ధ్వంసం చేసి చోరీకి పాల్పడి ఆలయంలో ఉన్న నగదు దోచుకెళ్లారు. శుక్రవారం దేవి ఆలయంలో సీసీ కెమెరాలను, హుండీని ధ్వంసం చేసి గుడి బయటపడేశారని కమిటీసభ్యులు పేర్కొన్నారు.

శివాలయంలో..

కోటగిరి : కోటగిరి మండలంలోని ఎత్తొండ క్యాంప్ గుట్టపైనున్న శివాలయంలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తలుపు తాళం, హుండీ తాళాలను పగులగొట్టి హుండీలో ఉన్న నగదును దోచుకున్నారు. సుమారు రూ. 10వేల మేరకు జమైన విరాళాల నగదు ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ చైర్మన్ నార్ల మదన్ కష్ణ మంగళవారం కోటగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ పూజారి ఇటీవల శబరిమలై వెళ్లినట్లు చైర్మన్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి వెల్లడించారు.

ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తికి జరిమానా

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ అమ్మాయిని ప్రేమ పేరుతో వేధించిన అజహర్‌ఖాన్‌కు (25)కు రూ.1,500 జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి శ్రీనివాస్ రావు తీర్పు వెల్లడించారు. అజహర్‌ఖాన్ వర్ని రోడ్డులో కిరాణా షాప్ నిర్వహించేవాడు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా ఉట్రిమిలో నివాసం ఉంటున్నారు. నగరానికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నానంటూ వెంబడిస్తూ నాల్గో టౌన్ పరిధిలో అమ్మాయితో గొడవ పెట్టుకున్నాడు. అక్కడ గుమిగూడిన ప్రజలతో కూడా గొడవ పడ్డాడు. దీంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి, విచారణ చేసిన తర్వాత ఏసీపీ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో కోర్టు విచారణ చేసి నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. రూ. 1,500 చెల్లించకపోతే మూణ్నెళ్ల సాధారణ జైలు శిక్ష విధిస్తామని ఉత్తర్వులు జారీ చేశారు.

గల్ఫ్ ఏజెంట్ ఇంటి ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ షేక్ అబ్దుల్ బషీర్ ఇంటి ఎదుట మంగళవారం గల్ఫ్ బాధితులు బైఠాయించి నిరసన తెలిపారు. బషీర్ కొంతకాలంగా గల్ఫ్ ఏజెంట్‌గా పనిచేస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన దాదాపు 600 మందిని మోసం చేసి సుమారు రూ. 2 కోట్ల వరకు టోకరా వేసి పరారయ్యాడని బాధితులు ఆరోపించారు. ఈ విషయమై ఎడపల్లి పీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఏజెంట్ ఇంటి ఎదుట ధర్నా చేశారు. డిచ్‌పల్లిలోని ఆర్కే ట్రావెల్స్ ద్వారా సుమారు 600 మంది వద్ద ఒక్కొక్కరి నుండి రూ. 20 వేల నుంచి రూ. 30 వేలు వసూలు చేశాడని బాధితులు ఆరోపించారు. కువైట్‌లో అమెరికన్ నేషనల్ ఫుడ్ ప్యాకింగ్ కంపెనీలో పని ఇప్పిస్తానంటూ అనేకమంది వద్ద డబ్బులు వసూలు చేసి, రెండురోజుల క్రితం ట్రావెల్స్‌ను ఎత్తేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారన్నారు. దీంతో సోమవారం డిచ్‌పల్లి ఆర్‌కే ట్రావెల్స్ వద్ద ధర్నా చేసిన బాధితులు మంగళవారం ఎంఎస్సీ ఫారంలో ఏజెంట్ ఇంటి ఎదుట ధర్నా చేశారు. జీపీ వద్దకు వచ్చి సర్పంచ్‌కు ఫిర్యాదు చేశారు. ఎడపల్లి ఏఎస్సై ఇలియాస్ ఏజెంట్ బషీర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా వారు ఆందోళన విరమించారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



మాచారెడ్డి : మండలంలోని పాల్వంచ గ్రామంలో వీధి కుక్కల దాడిలో మంగళవారం ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన కోరె బాలమల్లయ్య కొట్టంలో కుక్కలు చొరబడి ఐదు గొర్రెలను కొరికి చంపాయి. దీంతో రూ. 40 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బాలకార్మికుల గుర్తింపు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో మంగళవారం అధికారులు ముగ్గురు బాలకార్మికులను గుర్తించారు. గోపాల్‌పేటలోని ఫ్రైడ్‌వింగ్స్ బిర్యాని పాయింట్‌లో ఇద్దరు బాలకార్మికులను, జీవన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మరో బాలకార్మికున్ని అధికారులు గుర్తించారు. కాగా బాలకార్మికులను పనిలో పెట్టుకున్న ఫ్రైడ్‌వింగ్స్ బిర్యానీ పాయింట్ యాజమనితో పాటు జీవన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానిపై చర్య తీసుకోవాలని సంబంధిత అధికారులు నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

క్రైం కార్నర్

అటవీ భూమిని దున్నిన వ్యక్తి రిమాండ్

సిరికొండ : మండలంలోని రావుట్ల సెక్షన్ పరిధిలో అటవీ భూమిని చదును చేసిన జంగిలోడి తండాకు చెందిన మాలావత్ అర్జున్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. గత నెలలో అటవీ భూమిలో చెట్లు నరికివేసి భూమిని ట్రాక్టర్‌తో దున్నుతున్నాడని డిప్యూటీ రేంజ్ అధికారి మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

మోపాల్ (నిజామాబాద్ రూరల్) : మండలంలోని న్యాల్ కల్ చెరువులో పడి గ్రామానికి చెందిన పాసికంటి ఎల్లయ్య (52) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఎల్లయ్య బస్‌క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం మత్తులో ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్స మహేష్ తెలిపారు.

చికిత్సపొందుతూ రైతు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అమర్లబండకు చెందిన యువరైతు హంబీర్ చక్రధర్‌రావు(42) ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పేదకుటుంబంలో కొట్టుమిట్టాడుతున్న చక్రధర్‌రావుకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లు పెద్దవారవుతుండడంతోపాటు మూడెకరాల భూమిలో పంటలు సక్రమంగా పెరగకపోవడం, తండ్రి అనారోగ్యం బారిన పడడంతో అతనికి వైద్యం చేయించేందుకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు పెరగడంతోపాటు ఉండడానికి సొంత ఇల్లు లేకపోవడంతో చక్రధర్‌రావు మనోవేదనకు గురయ్యాడు. తీవ్రమనస్థాపానికి గురైన ఆయన ఆదివారం రాత్రి గడ్డిమందు తాగారని, చికిత్స నిమిత్తం ఆయనను ఎల్లారెడ్డిపేటలోని అశ్విని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఆయన మృతిచెందాడు. కాగా కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బండి రాజేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని నేరల్ తండా సమీపంలో మంగళవారం బైక్ అదుపు తప్పి బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైనట్లు 108 ఈఎంటీ సురేశ్, పైలట్ సంజీవ్ తెలిపారు. క్షతగాత్రులను హైదరాబాద్ బేగంపేట్‌కు చెందిన జబ్బార్, నాచారానికి చెందిన మధును కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మనుబోతును వేటాడిన వారిపై కేసు నమోదు



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని చెన్నాపూర్ బీట్‌లో మంగళవారం మనుబోతును వేటాడి చంపిన ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో మోహన్ భట్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బిచ్చం నాయక్ తండా శివారులో మొక్కజొన్న చేనులోకి మేతకు వచ్చిన మనుబోతును ఐదుగురు రైతులు వేటాడినట్లు తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బందిని గమనించిన నిందితులు మనుబోతు తలను కోసి పారిపోయినట్లు తెలిపారు. మనుబోతు కళేబరాన్ని స్వాధీనం చేసుకుని సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మనుబోతును వేటాడి చంపిన నిందితులు నేరల్ తండాకు చెందిన బర్దిలాల్ ఇందల్‌సింగ్, గుజ్జుల్ తండాకు చెందిన కేతావత్ పామ, బిచ్చం నాయక్ తండాకు చెందిన మంజా నానక్ సింగ్, మంజా జేల్‌సింగ్, బస్సీ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులందరూ పరారీలో ఉన్నారని త్వరలో అరెస్టు చేస్తామని ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



విలేకరుల సమావేశంలో నిందితుని వివరాలను వెల్లడిస్తున్న సీపీ నాగరాజు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలో ఇటీవల బంగారు దుకాణాల్లో చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు సీపీ నాగరాజు తెలిపారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీపీ నాగరాజు, ఏసీపీ ప్రభాకర్‌రావుతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన దీపేష్ రాంకేష్ గుప్తా, మాలి యామాజి, మరో బాల నేరస్తుడు పదిహేను రోజుల క్రితం ఆర్మూర్ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో, హుస్నాబాద్ గల్లీలో బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. నిందితులు రెండు దుకాణాల నుంచి 350 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను మంగళవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. కాగా ప్రధాన నిందితుడు మాలి యామాజి దొంగిలించిన సొత్తులో నుంచి తన వాటాతో మహారాష్ట్రకు పారిపోయాడు. మిగిలిన నిందితుల నుంచి రూ. 9 లక్షల విలువ గల 180 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వెల్లడించారు. బాల నేరస్తున్ని జువైనల్ హోంకు, రాంకేష్ గుప్తాను రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. అలాగే పరారీలో ఉన్న మాలి యామాజిని త్వరలో అరెస్టు చేస్తామని ఈ సందర్భంగా సీపీ తెలిపారు. చోరీ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు, ఎస్సై రాము, ఏఎస్సై గఫార్, కానిస్టేబుళ్లు గంగా ప్రసాద్, ప్రసాద్‌లను ఈ సందర్భంగా సీపీ రివార్డులు అందజేసి అభినందించారు.

గంజాయి విక్రేతలు..



వివరాలను వెల్లడిస్తున్న భీమ్‌గల్ సీఐ

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని హాసాకొత్తూర్ రోడ్‌లో గంజాయి విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భీమ్‌గల్ సీఐ వేంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం కమ్మర్ పల్లి మండలం కోనాసముందర్‌కు చెందిన కొండ రాజేశ్, కల్ల దేవరాజ్, కమ్మర్‌పల్లికి చెందిన మద్దెల ఈశ్వర్, లోలమ గణేశ్, చిత్తారి వంశీలు కలిసి కమ్మర్‌పల్లి శివారులోని హాసాకొత్తూర్ బైపాస్ రోడ్‌లో గంజాయి క్రయవిక్రయాలు జరుపుతుండగా, పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి 1050 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నిర్మల్ ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి కమ్మర్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఏర్గట్ల ఎస్సై రాజు, కమ్మర్‌పల్లి ఏఎస్ఐ ఇస్మాయిల్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుళ్లు శేఖర్, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

- విచారణ చేపట్టిన విద్యాశాఖ అధికారులు
- పరారీలో ఉపాధ్యాయుడు

నిజామాబాద్ అర్బన్/మోర్తాడ్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువే కామంధుడిగా మారాడు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ.. వీడి యోలు చూపిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనికి తోడు మహిళ టీచర్ కూడా కామంధుడి నీచమైన వ్యవహారాలను ప్రోత్సహించడంతో విద్యార్థినులపై సదరు టీచర్ మరింత రెచ్చిపోయాడు. ఏర్గట్ల మండలంలోని ఓ పాఠశాలలో ఈ వ్యవహారం కొన్నిరోజులుగా జరుగుతున్నా.. తా జాగా వెలుగులోకి వచ్చింది. సదరు పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు వి ద్యాశాఖ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశా రు. తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఓ మహిళా టీచర్ సైతం సార్ చెప్పినట్లు వినాలని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట హెచ్ఎంకు చెప్పినా పట్టించుకోలేదని, పాఠశాల కమిటీ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తేనే విషయం వెలుగులోకి వచ్చిందని సమాచారం. అలాగే సదరు ఉపాధ్యాయుడు ఓ సంఘం నాయకుడి తమ్ముడు కావడంతో అతడిని రక్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ కీచక టీచర్ పరారీలో ఉన్నాడు. విద్యార్థి సంఘాల నాయకులు సైతం మంగళవారం డీఈవో ఆఫీస్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య



అరుణ్‌గౌడ్ (ఫైల్)

మాక్లూర్ : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మండలంలోని మాదాపూర్‌కు చెందిన కిరాణా వ్యాపారి అరుణ్‌గౌడ్ (30) మంగళవారం తెల్లవా రుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. స్థానికంగా కిరాణా కొట్టు నడిపే అరుణ్‌గౌడ్ మహిళా సంఘాల్లో కూడా లక్షల్లో కొద్ది రుణాలు తీసుకున్నాడు. నెలవారిగా క ట్టాల్సిన డబ్బులు కట్టకపోవటం మహిళా సంఘాల నుండి ఒత్తిడి పెరగటంతో అరుణ్‌గౌడ్ ఉరి వేసుకొ ని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు కారు దహనం

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మండలంలోని రాంపూర్‌కు వెళ్లే రహదారి మధ్యలో సోమవారం రాత్రి ఓ కారు ప్రమాదవశాత్తు అగ్నికి అహుతైంది. ఆర్మూర్‌కు చెందిన ముగ్గురు యువకులు టాటాజెస్ట్ కారులో సోమవారం రాత్రి నందిపేట్‌కు వెళ్తున్న సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. రాత్రివేళ ప్రయాణిస్తున్న వీరు కారులో నుంచి పొగలు రావడంతో వారు కారు దిగి పరిశీలిస్తుండగానే ఒక్కసారిగా కారులో నుంచి మంటలు వ్యాపించాయి. వారు ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినప్పటికీ కారు అప్పటికే పూర్తిగా కాలిపోయిందని బాధితులు ఈ సందర్భంగా వాపోయారు



రాంపూర్ రహదారిపై పూర్తిగా కాలిపోయిన కారు

నివాస గృహం



ఫతేనగర్‌లో దగ్ధమైన ఇంటి పైకప్పును పరిశీలిస్తున్న తహసీల్దార్

నవీపేట : మండలంలోని ఫతేనగర్ గ్రామంలో తమ్మిడి విజయకు చెందిన నివాస గృహం ప్రమాదవశాత్తు మంగళవారం జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో జరగడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. రూ. 10 వేల నగదుతో పాటు వంట సామగ్రి, దుస్తులు దగ్ధమైనట్లు ఆయన పేర్కొన్నారు.